జంట జలాశయాలకు జలకళ

భాగ్య నగరానికి తాగునీటిని అందించే జంట జలాశయాలు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ (గండిపేట) జలకళను సంతరించుకున్నాయి. రెండు మూడు రోజులుగా ఎగువన రంగారెడ్డి జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో వరద నీరు చేరి నిండు కుండను తలపిస్తున్నాయి. వానలు ఇలాగే కొనసాగితే ఈ జలాశయాల నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉంది.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా


హిమాయత్ సాగర్


ఉస్మాన్ సాగర్

వంశీని అభినందించిన
సీఎం రేవంత్



ఆమనగల్లు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియకు ఏఐసీసీ ఇన్‌చార్జిగా నియమితులైన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీ చంద్‌రెడ్డి ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వంశీని సీఎం అభినందించారు. అనంతరం రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, కాంగ్రెస్ పార్టీ పదవుల నియామకం తదితర విషయాలపై చర్చించారు.

నేడు ఆమనగల్లుకు మంద కృష్ణమాదిగ

దివ్యాంగుల, చేయూత పింఛన్‌దారుల మహాసభ
ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు

ఆమనగల్లు, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో సోమవారం నిర్వహించే దివ్యాంగుల, చేయూత పింఛన్‌దారుల మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని దివ్యాంగుల ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ, మండల అధ్యక్షుడు శ్రీశైలం మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకనుగుణంగా దివ్యాంగులకు రూ. 6వేలు, చేయూత పింఛన్లు రూ.4వేలు, కండరాల క్షీణతల దివ్యాంగులకు రూ. 15 వేలు పింఛన్లు అందజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందన్నారు. సభకు దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మూగ జీవాలకు వైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోంది. పశు వైద్య కేంద్రాల్లో మందుల కొరత.. సరిపడా సిబ్బంది లేక పశువులకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. జీవాలకు ఏటా వేసే వ్యాధినిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు రెండేళ్లుగా అందుబాటులో లేవు. దీంతో పాడి రైతులు ప్రైవేట్‌గా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే పశు వైద్య సిబ్బంది కూడా సరిగా పని చేయకపోవడంతో రైతుల ఇబ్బందులు రెట్టింపయ్యాయి. ఒక వైపు ప్రభుత్వం పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. కొన్ని పశువైద్యశాలలు రోజుల తరబడి తెరుచుకోని పరిస్థితి ఉంది.

మూగ జీవాలకు అందని చికిత్స
మందులకు రెండేళ్లుగా కేటాయించని బడ్జెట్
సరఫరా కాని నట్టల నివారణ మందులు
ఏళ్ల తరబడి భర్తీకాని సిబ్బంది పోస్టులు
ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పశుపోషకులు

పశువైద్యం..
దయనీయం

కేంద్రాల్లో మందుల లేమి.. సిబ్బంది కొరత

రంగారెడ్డి అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పశు కేంద్రాలలో వైద్యం అటకెక్కింది. వైద్యులు, సిబ్బంది కొరత ఓ వైపు వేధిస్తుండగా.. మరోవైపు మందుల కొరత రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. వ్యాధుల బారిన పడిన జీవాలను పశు వైద్యశాలలకు తీసుకెళ్తే మందులు లేవని ప్రైవేట్ మెడికల్ స్టోర్లకు చీటీలు రాసి పంపిస్తున్నారు. ప్రైవేట్‌లో మందులు కొనడం పేద రైతులకు ఆర్థికంగా భారంగా మారింది.

అరకొర మందులతో...

మూగ జీవాలకు అత్యంత అవసరమైన మందులు అరకొరగా సరఫరా జరుగుతున్నాయి. గొర్రెలు, మేకలకు సంబంధించి యాంటీ బయోటిక్, హైర్ యాంటీ బయోటిక్ ఇంజక్షన్లు వేయాలంటే బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తుంది. నట్టల నివారణ మందులు ఏడాదికి నాలుగు విడతలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. మూడు విడతలు మాత్రమే

మిగతా 7వ పేజీలో...

మందులు లేవని చెబుతున్నారు



పశు వైద్యశాలలకు వెళ్తే మందులు లేవని చెబుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో జీవాలకు రోగాలు వస్తున్నాయి. ఏటా ఈ సీజన్‌లో రోగ నిరోధక టీకాలతోపాటు నట్టల నివారణ మాత్రలు వేసేవారు. ఈసారి వేయలేదు. రోగాలు వచ్చిన జీవాలకు చికిత్సలు అందక మృతి చెందుతున్నాయి. ప్రభుత్వం మందులు సరఫరా చేయాలి.

– మంత్రి చంద్రయ్య, గొర్రెలకాపరి, బాసుపల్లి, దోమ మండలం

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


స్వయం ఉపాధి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనేక విదేశీ సంస్థలు ముందుకు వస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణ రెడ్డి అన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ప్రైవేట్ రంగంలో లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నాయకులు కాలె మల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగ, ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. స్కిల్ ఇండియా యూనివర్సిటీలు ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చిన ఉపాధి కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్దఎత్తున ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని మరికొందరికి ఉపాధి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు ఖాదర్ ఖాద్రీ, ఫరీద్, కృష్ణనాయక్, కొండల్‌రెడ్డి, విజయ్, రాథోడ్, సురేశ్ నాయక్, బాబా, శ్రీనునాయక్, బద్ది వెంకటేశ్, ఎంగలి ప్రసాద్, వస్పుల శ్రీశైలం పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

ఆమనగల్లు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఎస్‌వో పద్మజ్యోతి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 40 సీట్లకు గాను పది సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.



బోనమెత్తిన..
ఊరూవాడ

జిల్లావ్యాప్తంగా ఆదివారం బోనాల పండగను ఘనంగా జరుపుకున్నారు. ఆషాఢమాసం సందర్భంగా ఊరూవాడ బోనమెత్తాయి. మహిళలు బోనాలను అందంగా అలంకరించుకొని ఊరేగింపుగా ఆలయాలకు తరలివెళ్లారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగా ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రజలు మొక్కుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.


కందుకూరు : ఆకులమైలారంలో బోనాల ఊరేగింపు


శంకర్‌పల్లి : సంకేపల్లి గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం

ఉప్పొంగిన వికారాబాద్ మండలంలోని పీరంపల్లి వాగు

రంగారెడ్డిఅర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆదివారం పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మేడ్చల్-మల్కాజిగిరి మండలం ఉప్పల్‌లో 36.5 మిల్లీమీటర్లు, అల్వాల్‌లో 29.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని రాక్‌టౌన్ కాలనీలో 28.3 మిల్లీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామంలో 18.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చేవెళ్ల మండలం కందవాడలో 17.5 మిల్లీమీటర్లు, బాలాపూర్‌లో 16.3 మిల్లీమీటర్లు, మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 12.8 మిల్లీమీటర్లు, పెద్ద మంగళారంలో 12.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లాలో పలు చోట్ల మోస్తరు వర్షం కురిసింది. వికారాబాద్, పూడూరు మండలాల్లో కురిసిన వర్షానికి వాగుల్లో వరద నీరు ప్రవహించింది. వికారాబాద్ మండలంలో పీరంపల్లి వెళ్లే మార్గంలో ఉన్న వాగు ఉధృతిగా కాజ్‌వే పైనుంచి ప్రవహించడంతో కొంతసేపు ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. పూడూరు మండలంలో 7.5 మి.మీ వర్షం కురియగా, వికారాబాద్‌లో 5.3 మి.మీ వర్షం కురిసింది. దావలాపూర్‌లో 3.3 మి.మీ, ధారూరులో 0.5 మి.మీ వర్షం కురిసింది. కాగా, వికారాబాద్ పట్టణంలో పట్టణంలోని ఆయా వార్డుల్లో బోనాల ఊరేగింపు నిర్వహించగా, మహిళలు వర్షంలో తడుస్తూనే బోనాల ఊరేగింపులో ఆలయాలకు తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.


పీరంపల్లి వాగు వద్ద నిలిచిన రాకపోకలు

స్థలాలు కేటాయించకుంటే మరో పోరాటం

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామేల్


సమావేశంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు

ఇబ్రహీంపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నాగన్‌పల్లి రెవెన్యూ రామోజీ ఫిలింసిటీ వద్ద గతంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలను కేటాయించకపోతే మరో పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామేల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో నిర్వహించిన ఇళ్ల స్థలాల సాధన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగన్‌పల్లి సర్వే నెం.189, 293లో సుమారు 700 మంది పేదలకు గతంలో 60 గజాల చొప్పున ఇళ్ల పట్టాలిచ్చారని ఆయన గుర్తు చేశారు. కాగా గత మార్చి 26న ఆ స్థలాల్లోకి లబ్ధిదారులు వెళ్లగా పోలీసులు అరెస్టులు చేశారన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబును కలిసినప్పుడు ఆయన కూడా సానుకూలంగా స్పందించారని, నాలుగు నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కరించలేకపోయారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని సీపీఎం బృందం కలిసిన సందర్భంలో సర్టిఫికెట్ ఉన్న పేదలకు స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బుగ్గరాములు, పి.జగన్, భిక్షపతి, నర్సింహ, బాల్‌రాజ్, ఆనంద్, సంతోష, కమలమ్మ పాల్గొన్నారు.

శుద్ధ తాగునీటితో సంపూర్ణ ఆరోగ్యం



నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి

ఆమనగల్లు, జూలై 20(ఆంధ్రజ్యోతి): శుద్ధతాగు నీరు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గానుగట్టు తండాలో రూ.3లక్షలతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని ఆదివారం రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తండాల్లో వసతులు కల్పించి గిరిజనుల ఇబ్బందులు తీర్చేందుకు కృషిచేస్తున్నామని అన్నారు. ఫౌండేషన్ సేవలను అన్ని గ్రామాలకు విస్తరిస్తున్నట్లు చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి, గ్రామాల సమగ్రాభివృద్ధే ఫౌండేషన్ ధ్యేయమన్నారు. జాబ్ మేళాలు నిర్వహించి వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. యువత టాస్క్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. తండాలో ఆలయ అభివృద్ధికి రూ.5లక్షల విరాళం ఇవ్వాలని తండా వాసులు రాఘవేందర్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, పత్యానాయక్, రమేశ్, లోక్య, బక్య, రాజు, బిక్యా, పరమేశ్, తరుణ్ పాల్గొన్నారు.

రూ.17.5కోట్లతో ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణం

● రెండు ఫ్లోర్ల నిర్మాణం పూర్తి ● ముమ్మరంగా పనులు

ఆమనగల్లు, జూలై 20(ఆంధ్రజ్యోతి):నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లులో ప్రభుత్వ వైద్య సేవలు విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు చేపట్టిన నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది చివరి వరకు పనులు పూర్తిచేసి నూతన ఆస్పత్రి భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. భవన నిర్మాణంతో వసతులు చేకూరి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో భవన నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతుండడంతో స్థానికులు ఆనందాన్ని, హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. 50ఏళ్ల కింద నిర్మించిన ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. పాత భవనంలో రోగులకు, వైద్య సిబ్బందికి సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవనం నిర్మించాలని పదేళ్లుగా స్థానికులు, నాయకులు ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారు. దీంతో 2023 ఆగస్టు 18న ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి వైద్య విధాన పరిషత్ ద్వారా రూ.17.5కోట్ల నిధులు మంజూరు చేసింది. 2023 అక్టోబరు 1న అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టెండర్లు పూర్తయి నెలలు గడిచినా భవన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ తీసుకొని గతంలో మంజూరు చేసిన నిధులను విడుదల చేయించారు. 2024 జూలై 10న మరోసారి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. పాత భవనాన్ని తొలగించి అదే స్థానంలో నూతన భవన పనులు చేపట్టారు. మూడు ఫ్లోర్లకు గాను ఇప్పటికే రెండో అంతస్తు పూర్తి అయ్యింది. మూడో అంతస్తు పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేందర్‌రెడ్డి, ఈఈ అబ్దుల్ అజీజ్, డీఈ రవీందర్‌ల పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మూడు ఫ్లోర్లలో 45వేల చదరపు ఫీట్లతో భవనాన్ని నిర్మిస్తున్నారు. భవన నిర్మాణానికి రూ.12కోట్లు, ఆస్పత్రి సామగ్రికి రూ.5.5కోట్లు కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. నిర్దీత గడువులోపు పనులు పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు.



ముమ్మరంగా సాగుతున్న ఆసుపత్రి భవననిర్మాణం

వైద్య సేవల విస్తరణకు ప్రభుత్వం చర్యలు



ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లు ఆసుపత్రికి విశాల భవన నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. పేదలకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ భవన నిర్మాణంతో వీలు కలుగుతుంది. ఆసుపత్రి భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. త్వరలోనే భవనం అందుబాటులోకి వస్తుంది.

- యాట గీత, ఏఎంసీ చైర్‌పర్సన్, ఆమనగల్లు

గడువులోపు నిర్మాణం పూర్తి



ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను గడువులోపు పూర్తి చేస్తాం. పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. రానున్న అక్టోబరు నాటికి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. ఆ దిశగా ఇప్పటికే చర్యలు చేపట్టాం. మూడంతస్తులకు ఇప్పటికే మొదటి అంతస్తు పూర్తైంది. పనులు మరింత వేగవంతంగా చేపట్టి పూర్తి చేస్తాం.

- రవీందర్, డీఈ, ఆమనగల్లు

కారంచేడు మృతులకు నివాళి



ఘట్‌కేసర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కారం చేడు ఘటన మయని మచ్చఅని అలాంటి ఘటనలు పునరావృతం కాకుండ ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధి మీసాల అరుణ్ కుమార్, చెల్లపురం నారాయణ అన్నారు. ఆదివారం అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్‌లోని ఎదులబాద్ రోడ్డులో గల అంబేడ్కర్‌కు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజుకు కారం చేడు ఘటనకు 40ఏళ్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. ఈమారణకాండలో మృతి చెందిన అమరులకు నివాళులర్పించారు. కారం చేడు ఘటన దేశంవ్యాప్తంగా బడుగులను ఆలోచింప జేసిందని అప్పట్లో కత్తి పద్మారావు చేసిన పోరాటంతో దళిత సమాజం ఎంతో చైతన్యం అయ్యిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో లలిత్, రాందాసు, నర్సింగ్‌రావు, రాజేష్, అంజయ్య, గణేష్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీడ్ బాల్స్ వదిలిన జైళ్ల శాఖ అధికారులు



పరిగి,జూలై 20 (ఆంధ్రజ్యోతి): పరిగి సబ్‌జైలు ఆధ్వర్యంలో ఆదివారం సీడ్‌బాల్ చల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. జైలు సూపరిండెంట్ రాజ్‌కుమార్,జైలు సిబ్బంది పరిగి-కొడంగల్ రోడ్డుకు ఇరువైపులా రెండువేల సీడ్‌బాల్స్ చల్లారు. సీడ్‌బాల్స్ వర్షాలకు మొలకెత్తి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది యాదగిరి, శ్రీను, కృష్ణ, అక్షయ్, నరేష్‌లు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి, ఇసుక దోపిడీ



మైలమ్మ చెరువులో మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

కులకచర్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలకు నీడ కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూర్ చేస్తే కొంత మంది మట్టి, ఇసుక దోపిడీకి పాల్పడుతూ యథేచ్ఛగా దోచుకుంటున్నారు. కులకచర్ల మండలంలోని పలు గ్రామాల్లో మట్టి, ఇసుక మాఫియాలా తయారై కొందరు నాయకులు విచ్చలవిడిగా రాత్రింబవళ్లు మట్టి, ఇసుక సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక మైలమ్మ చెరువు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని, ఇసుకను తరలిస్తున్నారు. చపాల గూడెం వాగులో ఇసుక తవ్వి తరలిస్తున్నారు. మరి కొందరు ఫిల్టర్ ఇసుక తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏ చర్యలు తీసుకోవడం లేదు.

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో దగా

పేద ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని కొంత మంది అత్యధిక ధరలను తీసుకుంటూ దగా చేస్తున్నారు. గతంలో ఒక ట్రాక్టర్ ట్రిప్పు మట్టి రూ.300కు లభించేది. ప్రస్తుతం రూ.600 వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటే ఆ ఇంటికి 50 నుంచి 60 ట్రిప్పులు అవసరం పడితే దీనికి రూ.50వేలు మట్టికి చెల్లించాల్సి వస్తుందని, పేదవాడు ఇళ్లు నిర్మించుకోవడం ఎలా అని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రతీ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో ట్రాక్టర్లలో మట్టి తరలిస్తున్నారు. చెరువు, కుంటల్లో ఇష్టాను సారం మట్టి తరలిస్తున్నారు. నిజానికి ఇందిరమ్మ లబ్ధిదారులకు వారు నిర్మించుకునే ఇంటి మందం ఉచితంగా మట్టి, ఇసుక తరలించుకునేందుకు అధికారులు అనుతిస్తున్నారు. ఇదే ఆసరాగా చేసుకుకొని కొందరు ట్రాక్టర్లు, టిప్పర్లలో మట్టి ఇసుక తోడుకుంటూ అమ్మేస్తున్నారు. అధికారులకు మాముళ్లు ఇస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.



చపాల గూడెం వాగు వద్ద అక్రమంగా డంప్ చేసిన ఇసుక

స్థానిక ఎన్నికల్లో యువత పోటీ చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రమేశ్

మోమిన్‌పేట్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువకులు ముందుకు వచ్చి పోటీ చేయాలని బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ర్యాగ రమేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని రాళ్లగూడుపల్లిలో బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం యువతను ఉద్దేశించి మాట్లాడారు. పదవి చిన్నదైనా, పెద్దదైనా పోటీకి సిద్ధంగా ఉండాలన్నారు. మారుతున్న రిజర్వేషన్లను దృష్టిలో ఉంచుకొని ప్రతీ వర్గంలోని యువకులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, పరమారెడ్డి, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి కిరీటం బహూకరణ



తాండూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం పాత కుంట కట్ట మైసమ్మకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్ ఆదివారం వెండి కిరీటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో విఠల్ కుటుంబీకులు, ఆలయ కమిటీ సభ్యులు వేణుగోపాల్, అర్చకులు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి..
బీజేపీ 'రోడ్ మ్యాప్'

● రోజువారి కార్యక్రమాలతో కార్యాచరణ
● ఎంపీ 'కొండా'కు బాధ్యతలు!
● క్షేత్రస్థాయిలో జిల్లా, రాష్ట్ర నేతల పర్యటనలు



తాండూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సిద్ధమవుతోంది. ఇందుకు 'రోడ్ మ్యాప్' ప్రకటించింది. ఎక్కువ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ద్విముఖ వ్యూహాన్ని రూపొందించింది. రోజూ ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లోకి, కార్యకర్తల్లోకి నాయకులు, నేతలు వెళ్లేలా షెడ్యూల్‌ను ఖరారు చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యకర్తలు, నాయకులను ఎన్నికలను కార్యోన్ముఖులను చేసేలా దిశానిర్దేశం చేస్తూ ప్రణాళికను రూపొందించారు. రాష్ట్ర నేతలు, పార్టీ కార్యవర్గం, జిల్లా నేతలు, కేంద్ర మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించేలా ప్లాన్‌ను చేశారు. మండల కేంద్రం యూనిట్‌గా పర్యటనలు చేపట్టనున్నారు. పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికలు ముగిసే వరకు ప్రజల్లో ఉండేలా ప్లాన్‌ను తయారు చేశారు.

రోడ్ మ్యాప్ ఇలా..

జూలై 21, 22, 23 తేదీల్లో పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆపైస్థాయి నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సహకార సొసైటీ సభ్యులకు, మండల స్థాయి, జెడ్పీటీసీ స్థాయిలో వర్క్‌షాప్, 25, 26వ తేదీల్లో ఒక ప్రముఖ దేవాలయ సందర్శన, అన్ని పోలింగ్ బూత్‌ల వారీగా మహా సంపర్క్ అభియాన్ ముగ్గురు లేదా నలుగురు మహిళలతో టీమ్ ఏర్పాటు, సమస్యలను గుర్తింపు, గృహాల సందర్శన ఉంటాయి. పోలింగ్ బూత్ కమిటీ, పార్టీ ప్రాథమిక సభ్యులు, పార్టీ శ్రేయోభిలాషులు, అభిమానులతో పోలింగ్ బూత్ బైఠక్, జూలై 27 నుంచి 30 వరకు నాలుగు రోజులు ప్రజాసమస్యలపై ఒక కిలో మీటర్ ర్యాలీ, అధికారులకు వినతిపత్రాల అందజేత వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆగస్టు 1, 2 తేదీల్లో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కేంద్రంలో ర్యాలీ, కలెక్టర్ వినతిపత్రం ఇవ్వడం, విలేఖరులకు వివరాల వెల్లడించడం చేస్తారు. 12అంశాలైన కార్యకర్తల సమ్మేళనం, మహిళా కార్యకర్తల, యువజన, ఎస్సీ, ఎస్టీల సమ్మేళనం, బూత్ కమిటీ, రచ్చబండ, శక్తికేంద్ర సమావేశాలు చేపట్టడం, విచార్ పరివాహక్ కార్యకర్తలను కలపడం, ఆలయాల సందర్శన, కుల సంఘాల నాయకుల సంపర్క్, ప్రజాప్రతినిధులను కలవడం, జిల్లా అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, మండల ప్రభారీలు, శక్తికేంద్ర ప్రముఖ్‌ల ఫేస్‌బుక్ లైవ్ ప్రోగ్రాం నిర్వహిస్తారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ టార్గెట్‌గా..

రాజకీయాంశాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను టార్గెట్‌గా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించింది. హమీలు నెరవేర్చక ప్రజలను మోసం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తాలని పిలుపునిస్తున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పంచాయతీల నిర్వీర్యంపై కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తారు.

ఎక్కువ సీట్లు గెలుస్తాం



స్థానిక ఎన్నికల్లో బీజేపీ గట్టి పోటీనిస్తుంది. జిల్లాలో మెజార్టీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్ స్థానాలను గెలుస్తాం. ప్రజా సమస్యలే ఎజెండాగా పల్లెల్లోకి వెళ్తాం. ప్రధాని మోదీ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతాం. పలు మండలాల్లో బీజేపీ కీలకం కాబోతోంది. మహిళలు, యువత, వీధి వ్యాపారులు, రైతులు, వృద్ధులు, కార్మికులకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తాం.

- బాలేశ్వర్‌గుప్తా, బీజేపీ జిల్లా ఎన్నికల కన్వీనర్

అన్నింటిలో పోటీ చేస్తాం



వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో గత ఎన్నికల్లో బీజేపీ 20 శాతమే పోటీ చేసేది. త్వరలో జరిగే ఎన్నికల్లో, వార్డు సభ్యుడి నుంచి అన్ని స్థానాలకు పోటీలో నిలబడతాం. గత వాతావరణానికి ఈ సారి జరిగే ఎన్నికలకు చాలా తేడా ఉంది. బీజేపీ మాటలు తక్కువ.. చేతలు ఎక్కువ పార్టీ అని ప్రజల నమ్మకం. ఎన్నికలకు సిద్ధమవుతున్నాం.

- కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ

మహిళలు మా వైపు మొగ్గుచూపుతున్నారు



త్వరలో జరుగబోయే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు మహిళలకే కేటాయించాలని కోరాం. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం మహిళలకు చేపడుతున్న పథకాలను టీమ్‌ల ద్వారా మహిళలకు వివరిస్తాం. బీజేపీకి మహిళా ఓటు బ్యాంకు ఉంది. ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు, ఆవాస్ యోజన, నెలకు ఒక్కొక్కరికి 6 కిలోల బియ్యం ఇస్తున్నది బీజేపీ ప్రభుత్వమే.

- సాహు శ్రీలత, రాష్ట్ర మోర్చా నాయకురాలు

'ఉమ్రా'కు బయల్దేరిన యాత్రికులు



ఎయిర్‌పోర్టులో యాత్రికులు

శంషాబాద్ రూరల్, జూలై20(ఆంధ్రజ్యోతి):ముస్లిం మతస్తులు ఉమ్రా యాత్రకు బయలుదేరారు. ఆదివారం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి 50 మంది ఉమ్రాలో 15 రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనల కోసం తరలివెళ్లారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు వారికి వీడ్కోలు పలికారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యాత్రికులు ఈ బృందంలో ఉన్నట్లు అల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ హఫీజ్ మహ్మద్ పయాజ్ అలీ తెలిపారు.


ఉద్యమకారులకిచ్చిన హామీలను నెరవేర్చాలి



యాలాల మహేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు ఇచ్చిన హమీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 22న చలో గన్‌పార్క్ కార్యక్రమం నిర్వహింస్తామని ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల ప్రధాన డిమాండ్‌లను పరిష్కరించాలని హైదరాబాద్ నగరంలోని గన్‌పార్క్ వద్ద నిర్వహించే కార్యక్రమానికి ఉద్యమకారులు, ఉద్యమకారిణులు, కవులు, కళాకారులు, వివిధ సంఘాల నాయకులు, అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని ఉద్యమకారులకు సంఘీభావం తెలిపి విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏఆర్పటు చేయాలన్నారు. జర్ఖండ్ రాష్ట్రం తరహాలో ప్రతి ఉద్యమకారుడికి నెలకు రూ.25వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇల్లు, రేషన్‌కార్డు ఇవ్వలే



రేషన్‌కార్డు ప్రొసీడింగ్‌లు ఇస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, జూలై20(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇల్లు, రేషన్ కార్డు కూడా పేదలకివ్వలేదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కులకచర్ల మండలం చాపలగూడెం, లాల్‌సింగ్ తండా, కుసుమసముద్రం, అనంతసాగర్ గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. రాంపూర్, సాల్వీడ్ గ్రామాల్లో మల్టీపర్పస్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు రేషన్‌కార్డు ప్రొసీడింగ్‌లు పంపిణీ చేశారు. అభివృద్ధిలో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు.నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో కులకచర్ల మండలానికి కొత్తగా 1,142 కార్డులు మంజూరైనట్లు తెలిపారు. ప్రతీ చెంచు కుటుంబానికి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు మంజూర్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, బ్లాక్-2 అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు కుమ్మరి స్వామి, గోపాల్‌నాయక్, జంగయ్య, సత్యమ్మ, అంజిలయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): తాండూరులో గల హైదరాబాద్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కాలేజి ప్రిన్సిపాల్ వసంతకుమారి ఆదివారం తెలిపారు. ఈ నెల 23 సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులను అభ్యర్థులు కళాశాలలో అందజేయాలని చెప్పారు. ఇంగ్లీష్, తెలుగు, వాణిజ్య శాస్త్రం(ఇంగ్లీష్ మీడియం) సబ్జెక్టుల్లో రెండు చొప్పున పోస్టులు ఉన్నాయన్నారు. అలాగే ఉర్దూ, సివిక్స్, గణితశాస్త్రం, హిందీ, బయాలజీ, జువాలజీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీలున్నాయని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ రెండు పోస్టులు ఉన్నాయని ఆమె చెప్పారు. ఆయా సబ్జెక్టుల్లో జనరల్ అభ్యర్థులకు కనీసం 55శాతం, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో పీజీ ఉండాలని ఉండాలని వివరించారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్ ఉత్తీర్ణులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

దంపతుల మధ్య మనస్పర్ధలు.. భర్త ఆత్మహత్య

కీసర రూరల్, జూలై20(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మనస్పర్థలతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం కీసర మండలంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు.. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన వేణుగోపాల్ (40), హారిక దంపతులు రెండునెలల నుంచి నాగారం సత్యనారాయణ కాలనీలో నివసిస్తున్నారు. దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. అత్త మామలు అల్లుడిపై బెదిరింపులకు పాల్పడటంతో వేణుగోపాల్ ఈనెల 17న గడ్డి మందు తాగగా గాంధీలో చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, వారికి రెండేళ్ల పాప ఉందని తెలిపారు.

కంపచెట్లు.. పొంచి ఉన్న ముప్పు



యాచారం మండలం గున్‌గల్‌లో సాగర్-హైదరాబాద్ రహదారిపై రెయిలింగ్‌కు ఆనుకొని ముళ్ల కంపచెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొంతకాలంగా ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేదని స్థానికులు చెబుతున్నారు. **- యాచారం, జూలై 20(ఆంధ్రజ్యోతి)**

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి

ఆదిభట్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): వార్డు స్థాయిలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని ఇబ్రహీంపట్నం టీడీపీ కమిటీల పరిశీలకుడు గుమ్మడి అంజిరెడ్డి అన్నారు. ఆదివారం ఆదిభట్ల పరిధిలోని బొంగ్లూర్‌లో గల కల్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం మెట్టు దామోదర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాబోయే కాలంలో టీడీపీకి మంచి భవిష్యత్తు ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి వార్డులో పోటీచేయాలని సూచించారు. పార్టీని బలోపేతం చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి స్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందన్నారు. అనంతరం మున్సిపల్ టీడీపీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హర్షవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దండు సుధాకర్, కార్యదర్శులు బాలీరాజు, మల్లారెడ్డి, నరసింహ, అధికార ప్రతినిధిగా జంగయ్యలను ఎన్నుకున్నారు. చక్రపాణి, జక్కా రాంరెడ్డి, వెంకటరెడ్డి, సత్యానారాయణగౌడ్, ఆంజనేయులుగౌడ్, శ్రీశైలం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం



మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, జూలై 20(ఆంధ్రజ్యోతి):దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదపడుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగే వారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని పేర్కొన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఆదివారం నారాయణరెడ్డి సందర్శించారు. నాయకులతో కలిసి అమ్మవారికి పూజలు చేశారు. అంతకు ముందు నారాయణరెడ్డి ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు బిచ్యానాయక్, హీరాసింగ్, లక్పతినాయక్, జవహర్‌లాల్‌నాయక్, తులసీరామ్, రాంచందర్‌నాయక్, వెంకటేశ్, నరేశ్, లక్ష్మయ్య, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ముమ్మరం



ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్న ఏఈవో బాబు

కులకచర్ల, జూలై 15(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండల పరిధిలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాలకు వెళ్లి రైతుల వివరాలతో నమోదు చేపడుతున్నారు. భూమి ఉన్న ప్రతీ రైతు తప్పనిసరిగా తమకున్న భూములకు సంబంధించిన వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీ చేయబడుతుంది. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యజమాన్య వివరాలను రైతు యొక్క ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసి ఫార్మర్ రిజిస్ట్రీ కార్డు ఇస్తారు.

కేంద్ర ప్రభుత్వాలకు మాత్రమే

కేంద్ర ప్రభుత్వాలకు ఫార్మర్ రిజిస్ట్రీ అనుసంధానం చేయడం జరుగుతుంది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధిపొందేందుకు ప్రామాణికంగా రిజిస్ట్రీ తప్పనిసరి. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ఏ రకమైన చట్టబద్ధత యజమాని హక్కును కల్పించదు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న వివరాలను తీసుకొని రైతులకు ఐడీ కార్డు అందిస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ పథకం రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతు భరోసా, రుణమాఫీ తదితర పథకాలతో ఫార్మర్ రిజిస్ట్రీతో ఎలాంటి సంబంధం ఉండదు.

ఫార్మర్ ఐడీ పొందేందుకు కావాల్సిన పత్రాలు

రైతు విశిష్ట సంఖ్యను ఫార్మర్ ఐడీ పొందేందుకు ఆధార్ కార్డు, భూ యజమాన్య పాస్‌బుక్, ఆధార్ లింకు చేయబడిన మొబైల్ నంబరు తీసుకొని వ్యవసాయ శాఖ కార్యాలయంలో లేదా ఏఈవోను సంప్రదించి రైతు గుర్తింపు కార్డు పొందాలని వ్యవసాయ అధికారులు తెలిపారు.

రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి



కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం రైతులందరూ రైతు వేదికల వద్దకు ఆయా పత్రాలను తీసుకొచ్చి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి. ఈ రిజిస్ట్రీతో రైతులు ఎన్నో పథకాలు పొందవచ్చు. భూ పట్టా పాసుపుస్తకం కలిగిన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

\- వీరస్వామి, ఏవో

కుల వృత్తులకు చేయూత



అంకుశాపూర్‌లో డప్పులు అందజేస్తున్న మోర రాజిరెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కులవృత్తులను ఆదరించాలని అంకుశాపూర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు బుచ్చయ్య తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని 15 మంది డప్పు కళాకారులకు అదే గ్రామానికి చెందిన రియల్ వ్యాపారి మోర రాజిరెడ్డి డప్పులను అందజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తులను ఆదరించి బతికించాలని కోరారు. 'కుల వృత్తులను మానకురా గువ్వల చెన్న.' అనే సామెతను ఆయన గుర్తుచేశారు. మనం ఏ స్థాయికి ఎదిగినా కుల వృత్తులను మరిచిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింత కింది లాలయ్య, డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఖరారు

- రిజర్వేషన్ల ప్రక్రియ సబ్ కలెక్టర్ చేతికి
- మొదలైన రాజకీయ హడావుడి



తాండూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలైన పార్టీ గుర్తులపై జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు గెలిచాక ఏడాదిన్నర తర్వాత జరుగుతున్నవి కావడంతో ఎమ్మెల్యేలకు మొదటి పరీక్షగా చెప్పొచ్చు. టికెట్ల కేటాయింపు మొదలుకొని ఎంపీటీసీ, జెడ్పీ చైర్మన్‌లు ఎన్నుకునే వరకు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటారు. గతంలో పెద్దేముల్ ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను అధికారం లేకున్నా కాంగ్రెస్ పార్టీ సునాయసంగా గెలుపొందింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో ఫైనల్ జాబితా జిల్లాల వారీగా ప్రభుత్వం బుధవారం ప్రకటించడంతో ఆశావాహుల వాడివేడి మొదలైంది. టికెట్ ఆశిస్తున్న నాయకులు గ్రూప్‌లు కడుతూ ప్రయత్నాలు మొదలుపెట్టారు. బీఆర్ఎస్‌లో ఎన్నికల హడావుడి కనిపించడం లేదు. తాండూరు మండల స్థాయి సన్నాహక సమావేశం మాత్రమే ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తాండూరు వచ్చి, క్యాడర్‌ను ఉత్తేజ పరచాలని కోరుతున్నారు. బీజేపీ స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతోంది. తాండూరు ప్రాంతానికి చెందిన బాలేశ్వర్‌గుప్తాను పార్టీ జిల్లా ఎన్నిక కన్వీనర్‌గా నియమించారు. కాగా డివిజన్ స్థాయిలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో లేదా సబ్ కలెక్టర్ నిర్వహించడం ఆనవాయితీ. తాండూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రిజర్వేషన్ల ప్రక్రియను సబ్‌కలెక్టర్ చేపట్టనున్నారు. తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రిజర్వేషన్‌లకు సంబంధించి ఎంపీటీసీల జాబితా సబ్ కలెక్టర్ చేతికి వెళ్లినట్లు సమాచారం.

మందు బాబులకు అడ్డగా రైతు వేదికలు



నీళ్లపల్లి క్లస్టర్ పరిధి రైతు వేదిక

బషీరాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీళ్లపల్లి, ఎక్మాయి, మంతట్టి క్లస్టర్ల పరిధిలోని రైతు వేదిక భవనాలు మందు బాబులకు అడ్డాలుగా మారాయి. సాయంత్రం అయ్యిందంటే చాలు మందు బాబులు మద్యం సీసాలతో రైతు వేదికల వద్ద, పరిసరాల్లో దర్శనమిస్తున్నారు. మద్యం మత్తులో కొందరు కిటికీల అద్దాలు, తలుపులను కూడా ధ్వంసం చేస్తున్నారు. వేదికల పరిసరాలను అపరిశుభ్రంగా తయారు చేయడమే కాకుండా సీసాలను అక్కడే పడేసి పోతున్నారు. ఇదిలా ఉండగా రైతు వేదికలు ఊరి చివర్ల ఉండటంతో మద్యం బాబులు వేదికల వద్ద కూర్చుని ఎంజాయ్ చేస్తున్నారని గ్రామాలప్రజలు వాపోతున్నారు. ఎక్మాయి, నీళ్లపల్లి వేదికల అద్దాలు ధ్వంసం చేయడంతో లోపల సామగ్రికి భద్రత లేకుండా పోయింది. మందు బాబులు కిటికీల అద్దాలను పగులగొట్టి లోపల కూర్చుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. వేదికల వద్ద మద్యం నిత్యం మద్యం ఖాళీ సీసాల కన్పిస్తుండడంతో ఏఈవోలు ఆందోళన చెందుతున్నారు.



నీళ్లపల్లి రైతు వేదిక వెనక వాష్ రూం మేసిన్‌లో బీరు సీసా



రైతు వేదిక కిటికీ అద్దాలను ధ్వంసం చేశారిలా...

ఇందిరమ్మ ఇళ్లకు.. ఆటంకాలు

- భారీగా పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలు
- కాగ్నాలో ఇసుక తోడుకోనివ్వక ఇక్కట్లు



బేస్మెంట్ లెవల్ వరకు నిర్మాణమైన ఇందిరమ్మ ఇల్లు

తాండూరు/ధారూరు/పెద్దేముల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. కూలీలతో పాటు ఇసుక, సిమెంట్, ఇటుకల ధరలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం నిర్దేశించిన వ్యయంతో ఇంటి నిర్మాణం పూర్తిచేయడం కష్టమని లబ్ధిదారులు అంటున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం విడతల వారీగా రూ.5లక్షలు మంజూరు చేస్తుంది. కొందరు ఇళ్ల స్థలాల్లేక పాత ఇళ్లు కూలగొట్టి నిర్మించుకుంటున్నారు. పాతిళ్లు కూలగొట్టి వ్యర్థాల తొలగింపు పేదలకు ఆర్థిక భారంగా మారింది.

జిల్లాలో తాండూరు మండలం టాప్

వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన మండలంగా తాండూరు టాప్‌లో నిలిచింది. మండలానికి 832ఇళ్లు మంజూరు కాగా 491నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉంటే తాండూరు మున్సిపాలిటీలో ఒక్క నిర్మాణం కూడా ప్రారంభించలేదు. తాండూరు నియోజకవర్గానికి రెండు విడతల్లో 7వేల ఇండ్లు మంజూరయ్యాయి. పెద్దేముల్ మండలానికి 793 ఇళ్లు, యాలాలకు 472, బషీరాబాద్‌కు 703, తాండూరుకు 832ఇండ్లు మంజూరయ్యాయి. అయితే ఈ అన్ని మండలాల్లో సరాసరి 45శాతం ఇళ్ల పనులు మొదలయ్యాయి. ఇదిలా ఉంటే ఇళ్ల పథకం ప్రారంభం నుంచి నిర్మాణ, తాపిమేస్త్రీ, లేబర్ చార్జీలు పెరిగాయి. వ్యవసాయ పనుల ప్రారంభంతో కూలీల కొరత కూడా ఏర్పడింది.

అదను చూసి ఇసుక, కంకర ధరల పెంపు

ఇళ్ల నిర్మాణాలతో వ్యాపారులు ఇసుక, కంకర ధరలను పెంచారు. వాగుల నుంచి ఇసుక రవాణను కట్టడి చేశారు. దీంతో కొరత ఏర్పడింది. వికారాబాద్, తాండూర్‌ల నుంచి ఇసుకను తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇసుక ధరలను వ్యాపారులు అమాంతం పెంచేశారు. కొన్ని రోజుల క్రితం వరకు రవాణా చార్జీలు కాకుండా టన్ను ఇసుక రూ.1,700. ఇప్పుడు రూ.2,300 పెంచారు. ఒక ట్రాక్టర్ ఇసుక రవాణా చార్జీలతో రూ.12వేల వరకు అవుతోందని నిర్మాణదారులు వాపోతున్నారు. అధికారుల అజామాయిషీ లేక వ్యాపారులు ధర పెంచుతున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నేరుగా అమ్మితే ట్రాక్టర్ ఇసుక రూ.5వేల లోపే దొరుకుతుందంటున్నారు. అలాగే 300స్క్వేర్ ఫీట్లకు సరిపోను కంకర ధర రూ.9వేల నుంచి 12వేలకు పెంచారు. క్రషర్ వద్ద ట్రాక్టర్ కంకర లోడ్‌కు రూ.500 నుంచి వెయ్యి వరకు పెంచారు. ఇళ్ల బేస్మెంట్ నింపేందుకు మొరం అవసరం. అయితే మొరం రవాణా ట్రాక్టర్లను అధికారులు పట్టుకుంటుండటంతో మొరం దొరకక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలా అన్నింటి రేట్ల పెరుగుదలతో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు సరిపోవని లబ్ధిదారులు అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బుకు మరో 2.5లక్షలు ఖర్చు చేస్తేనే ఇంటి నిర్మాణం పూర్తవుతుందని చెబుతున్నారు.

సామగ్రి	పాత ధర	కొత్త ధర
	(రూపాయలు)	
స్టీల్(కిలో)	48	55
సిమెంట్(బస్తా)	280	320
ఇసుక(ట్రాక్టర్)	2,500	4,000
ఇటుక ఒకటి	9	11
లేబర్ దినసరి	600	800
మేస్త్రి కూలి	900	1,200
దొడ్డు కంకర(ట్రాక్టర్)	2,000	2,500

చెంతనే ఇసుక అందక చింత

పెద్దేముల్ మండల శివారులో వాగున్నా ఇసుక తెచ్చుకునే పరిస్థితి లేకుండా పోయింది. వాగు నుంచి కొందరు ఇసుక తోడుకోనివ్వడం లేదు. ఇసుకకు భారీగా డబ్బు వెచ్చించాల్సి వస్తోంది. మండలంలో 793 ఇండ్లు మంజూరయ్యాయి. 345 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. రేగొండి శివారు రుక్మాపూర్ రైల్వే స్టేషన్ సమీప కాగ్నావాగు నుంచి ఇసుక తోడుకునేందుకు రెవెన్యూ శాఖ పర్మిట్లిస్తోంది. మన్‌సాన్‌పల్లి, మదనంతాపూర్, రేగొండి, రుక్మాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో వాగు ప్రవహిస్తున్నా మన్‌సాన్‌పల్లి, మదనంతాపూర్‌ల వద్ద ఇసుక లభ్యత లేదు. రుక్మాపూర్ రైల్వేస్టేషన్, యాలాల మండలం అడాల్‌పూర్ సమీపంలో ఇసుక తోడుకునేందుకు అనుమతించారు. అయితే అడాల్‌పూర్ వద్ద కొందరు ఇసుక తోడుకోకుండా అడ్డుకుంటున్నారు. పోలీసులు సైతం అది పెద్దేముల్ పరిధి కాదని, అక్కడి నుంచి ఇసుక తోడుకోవద్దని ట్రాక్టర్లను వెనక్కి పంపుతున్నారు. అలాగే వాగు నుంచి కొందరు రైతులు పొలాలకు నీరు పారించేందుకు పైప్‌లైన్ వేసుకున్నారు. ఇసుక ట్రాక్టర్లు వస్తే పైపులు పగిలిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే పైపులను కాస్త లోతలో వేసుకుంటే పగిలే అవకాశం లేదని, అయినా రైతులు వినిపించుకోవడం లేదని లబ్ధిదారులు అంటున్నారు.

సిమెంటు కొనుగోళ్లు పెరిగాయి



ఏడాది కాలంగా నిర్మాణాలు లేక కుదేలైన సిమెంట్ వ్యాపారం ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో సిమెంటు కొనుగోళ్లు పెరిగాయి. సిమెంట్ ధరలు సైతం స్వల్పంగా పెరిగాయి. సిమెంటు కంపెనీలు బట్టి సిమెంట్ ధరలు పెరుగుతున్నాయి. గత నెల రోజులుగా సిమెంటు విక్రయాలు జోరందుకున్నాయి.

\- రవికుమార్, వినాయక సిమెంట్ ఏజెన్సీ

ఉచిత ఇసుకపై అవగాహన కల్పించడం లేదు



ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఉచిత ఇసుకను సరఫరా చేస్తామని మంత్రులు ప్రకటించినప్పటికీ, ఇళ్ల నిర్మాణదారులకు ఇవ్వడం లేదు. పని త్వరగా చేసుకునేందుకు ఎక్కువ రేటు పెట్టి ఇసుక కొంటున్నాం. ఒక్క ట్రాక్టర్‌కు రూ.వేల చొప్పున తీసుకొని ఇసుక సరఫరా చేస్తున్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.2వేల నుంచి 3వేల ఉండేది. బేస్మెంట్ లెవల్ వరకే రూ.2లక్షల వరకు ఖర్చు అయ్యింది.

\- సుశీలమ్మ, ఇంటి లబ్ధిదారు, కందనెల్లి

పశువైద్యం.. దయనీయం

(ఐదో పేజీ తరువాయి)

సరఫరా చేస్తున్నారు. ఆవులు, గేదెలకు సంబంధించి కాల్షియం సప్లమెంట్స్ అరకొరగానే ఉన్నాయి. పశువులకు కుక్కలు కాటు వేస్తే వెంటనే ఇంజక్షన్లు ఇవ్వాలి. ఏడాదికి వేల సంఖ్యలో ఇంజక్షన్లు సరఫరా చేయాల్సిన పశు సంవర్ధక శాఖ నామమాత్రంగా పంపిణీ చేస్తోంది. పెయిన్ కిల్లర్స్‌కు మెలాక్స్‌కమ్, యాంటీ ఎస్ట్‌మెంట్, యాంటీ డయేరియా మందులు, ఈత తర్వాత పశువులకు అందించాల్సిన ఎడ్‌బోలిక్ మందులు, డీ-25 సిలైన్ బాటిల్స్ అంతంత మాత్రంగానే అందుబాటులో ఉన్నాయి.

రంగారెడ్డి జిల్లా కేశంపేట పశువైద్యశాలలో టీకాలు తప్ప ఇతర మెడిసిన్ అందుబాటులో లేవు. గత అక్టోబరు నుంచి మందులు లేక పాడి రైతులు బయట కొంటున్నారు. మూడేళ్లుగా నట్టల నివారణ మందులు పూర్తిస్థాయిలో సరఫరా లేదు. ఫరూక్‌నగర్ మండలం బూర్గుల, రాయికల్, చించోడ్,వెలిజర్ల గ్రామాల పశువైద్య కేంద్రాల్లో నట్టల నివారణ మందుల్లేవు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల పశువైద్య కేంద్రాల్లో జీవాలకు నట్టల నివారణ మందులు అందుబాటులో లేవు. రెండున్నరేళ్లగా ప్రభుత్వం నుంచి రావడం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం పరిధిలో నట్టల నివారణ మందులు ఏడాది కాలంగా సరఫరా కావడం లేదు. గొర్రెల కాపరులు ప్రైవేట్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఏడాదిలో రెండు, మూడు సార్లు నట్టల నివారణ మందులు వేసేందుకు క్యాంపులు నిర్వహించేవారు. మందుల కొరత కారణంగా క్యాంప్‌ల ఏర్పాటు అంతంత మాత్రంగా ఉంది. చేవెళ్ల మండలంలో ఏడు పశువైద్య కేంద్రాల్లో రెండేళ్లుగా నట్టల నివారణ మందులు లేవు. షాబాద్ మండలం షాబాద్, రేగడి దోసాడ పశువైద్య కేంద్రాల్లో రెండేళ్లుగా నట్టల నివారణ మందులు లేవు. శంకర్‌పల్లి పశువైద్య కేంద్రంలో ఇదే పరిస్థితి నెలకొంది.

వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ వైద్య కేంద్రంలో గొర్రెలకు ఈగలు వాలకుండా వాడే మందు (బూటాక్స్) లేవు. గడ్డి విత్తనాలు అందుబాటులో లేవు. బషీరాబాద్, గొట్టిగ ఖుర్దు పశు వైద్యశాలలతో పాటు మైల్వార్, రెడ్డిఘణాపూర్ గ్రామాల్లో ఉప కేంద్రాలున్నాయి. వీటికి నాలుగు నెలలుగా మందులు సరఫరా లేదు. వికారాబాద్ నియోజకవర్గంలో నట్టల నివారణ మందుల కొరత తీవ్రంగా ఉంది. ఏడాది కాలంలో సరఫరా లేదు. పెన్సిలిన్, ఏవిల్, డీవార్మింగ్ లిక్విడ్, టార్పెంట్ ఆయిల్ కొరత ఉంది. గేదెలకు గొంతువాపు, మేకలకు లంపిస్కిన్ వ్యాధులు సోకుతున్నాయి. యాలాల మండలంలో రెండు పశువైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది. రెండేళ్లుగా నట్టల నివారణ మందుల్లేవు. పది నెలలుగా వివిధ రకాల మందులు సరఫరా లేదు. వికారాబాద్ జిల్లాలోని 20మండలాల్లో 38 పశువైద్యశాలలు, 58 పశువైద్య ఉపకేంద్రాలున్నాయి. 38 మంది పశువైద్యులకు గాను 22 మందే పని చేస్తున్నారు. 16 పశువైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 58 ఉప కేంద్రాల్లో 58మంది పశుచికిత్స సిబ్బందికి గాను 35 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 23 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో గొర్రెలు, మేకలు కలిసి ఐదు లక్షలకుపైగా ఉన్నాయి. 2.2లక్షలకుపైగా వివిధ రకాల పశువులు ఉన్నాయి. మొత్తం కలిపి 7.2లక్షల జీవాలు ఉన్నాయి.



బషీరాబాద్ పశువైద్య కేంద్రంలో అరకొరగా మందులు

మేడ్చల్ జిల్లా కీసర పశు వైద్యశాలలో ఆరు నెలలుగా మందులు లేవు. బడ్జెట్ లేకపోవడమే మందుల కొరతకు కారణమని చెబుతున్నారు. ఉద్దెమర్రి పశు వైద్యశాలలో ఏడు నెలలుగా మందులు కొరత ఉంది. ఘట్‌కేసర్‌లోని పశువైద్యశాలలో నట్టల నివారణ మందులు లేవు. ప్రభుత్వం పశువైద్యశాలలకు మందులు సరఫరా చేయక ప్రైవేట్ వైద్యులను, మెడికల్ స్టోర్లను ఆశ్రయిస్తున్నారు. పశువైద్యశాలల్లో మందులు పూర్తిస్థాయిలో సరఫరాతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లో జీవాలకు మెరుగైన వైద్యం అందుతుంది. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి అంబులెన్స్‌లను కొనుగోలు చేసిన ప్రభుత్వం పశు వైద్యశాలలను సైతం పటిష్టం చేసేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా రైతులు, పశుపోషకులు కోరుతున్నారు.

అన్ని చోట్లా వేధిస్తున్న సిబ్బంది కొరత

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పశువైద్యశాలల్లో సమస్యలు తిష్టవేశాయి. మందులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. 11ఏళ్లుగా పశువైద్యాధికారుల పోస్టులను భర్తీ చేయడం లేదు. దీంతో పశువులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. పాడి రైతులు, పశుపోషకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రంగారెడ్డి జిల్లాలో నాలుగు(తాలూకా స్థాయి) ప్రాంత పశువైద్య శాలలు, 46పశువైద్య కేంద్రాలు, 87 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 309మంది పశువైద్య సిబ్బంది ఉండాల్సి ఉండగా 202మంది ఉన్నారు. 107 ఖాళీలు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా అటెండర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో అటెండర్లు రిటైర్ అవుతున్నారు. నియామకాలు మాత్రం చేపట్టడం లేదు. అటెండర్లు పదోన్నతి కోసం డిపార్టుమెంటల్ పరీక్షలు ఎగ్జామ్ రాసి పారా సిబ్బంది పోస్టుకు కన్వర్ట్ అవుతున్నారు. ప్రతీ పశువైద్యశాలలో అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. అధిక శాతం పశువైద్య కేంద్రాల్లో డాక్టర్లు ఉంటే సిబ్బంది.. సిబ్బంది ఉంటే డాక్టర్లు లేరు. వీరిద్దరూ ఉన్నచోట్ల వెటర్నరీ ఆస్పత్రుల్లో మందుల్లేవు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ పశువైద్య కేంద్రంలో రెండు పశువైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుతో రెండు లైవ్‌స్టాక్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని రెండు పశువైద్యశాలల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. నట్టల నివారణ మందులు లేవు. వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. ప్రైవేట్ వెటర్నరీ డాక్టర్ వద్దకు గొర్రెలను తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నాను.

మందులు లేక ఆవు చనిపోయింది



నెల రోజుల క్రితం ఆవుకు కుక్క కాటు వేసింది. బంట్వారం పశువైద్యాధికారికి సమాచారం అందించాను. కానీ అక్కడ యాంటీ రెబీస్ ఇంజక్షన్ లేకపోవడంతో ఆవు చనిపోయింది. పశువైద్య కేంద్రాల్లో ఇంజక్షన్లు, మందులు అందుబాటులో ఉండటం లేదు.

\- ఒగ్గు రాములు, రైతు, రొంపల్లి, బంట్వారం మండలం

మందులకు బడ్జెట్ కేటాయించడం లేదు



జిల్లాలో మందుల కొరత, సిబ్బంది కొరత వాస్తవమే. రెండేళ్లుగా మందులకు బడ్జెట్ రావడం లేదు. నట్టల నివారణ మందుల సరఫరా లేదు. గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ ఏటా మూడు సార్లు చేయాల్సి ఉంది. పైనుంచే మందుల కొరత ఉండడంతో జీవాలను డీవార్మింగ్ చేయలేకపోతున్నాం. జిల్లాలో 38 మంది డాక్టర్లకు గాను 22 మంది ఉన్నారు. 58 పశుఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా 23 కేంద్రాల్లో సిబ్బంది లేరు. అయినా సిబ్బందిని గ్రామాలకు పంపిస్తూ పశువులకు చికిత్స చేయిస్తున్నాం.

\- సదానందం, జిల్లా పశువైద్యాధికారి, వికారాబాద్



మృతురాలి కుటుంబానికి పరామర్శ

కడ్తాల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిచెడ్ గ్రామానికి చెందిన సాలమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. రూ.5వేలు సాయాన్ని అందజేశారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, నాయకులు పారేశ,రాంరెడ్డి, రామస్వామి, ఆంజనేయులు, శేఖర్, రవి, ప్రశాంత్ కుమార్ ఉన్నారు.

విద్యాదానం.. మహాదానం

కేశంపేట జూలై 20(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని సికింద్రాబాద్ జూనియర్ ఛాంబర్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నాగ శ్రీధర్ అన్నారు. కొండారెడ్డిపల్లి జెడ్పీ పాఠశాలకు సికింద్రాబాద్ జూనియర్ ఛాంబర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 40 బెంచీలను బహూకరించారు. ట్రస్ట్ చైర్మన్ నాగ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం తమ ట్రస్టు సాయసహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కమలాకర్, హెచ్ఎంలు చక్రధర్‌రావు, మల్లికార్జున్, టీచర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నప్ప, రాజ్ కుమార్‌రెడ్డి, రవికుమార్, లావణ్య, కవిత, వినీత్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు బెంచీలను బహూకరిస్తున్న ట్రస్టు సభ్యులు

రహీం సాకర్ లీగ్ విజేత శ్రీనిధి

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం నిర్వహించిన 'ఏ' డివిజన్ రహీం సాకర్ లీగ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం అజీజ్‌నగర్‌లో డెక్కన్ ఎరీనాలో ఆర్టీ బాయ్స్ ఎఫ్‌సీతో జరిగిన ఆఖరి మ్యాచ్‌ను శ్రీనిధి 1-1తో డ్రా చేసుకుంది. లీగ్‌లో మొత్తంగా 34 పాయింట్లతో టాప్‌లో ఉన్న శ్రీనిధికి ట్రోఫీ లభించగా, 32 పాయింట్లతో ఆర్టీ బాయ్స్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఏజీఓఆర్‌సీ జట్టు 29 పాయింట్లతో తృతీయ స్థానం దక్కించుకుంది. గత నాలుగు నెలలుగా ఈ లీగ్‌లో 91 మ్యాచ్‌లను నిర్వహించామని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఫల్గుణ తెలిపారు. ద్రోణాచార్య అవార్డీ సయ్యద్ నయీముద్దీన్, ప్రముఖ న్యాయవాది అశోక్ ఆనంద్ విజేత జట్టుకు ట్రోఫీ బహూకరించారు.



ట్రోఫీతో శ్రీనిధి జట్టు

అమ్మోర్లకు బోనం

- ఉత్సాహంగా సాగిన ఊరేగింపు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు


షాద్‌నగర్‌లోని మల్లికార్జున కాలనీలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు నిర్వహించారు. కాలనీలవారిగా మహిళలు బోనాలను ఎత్తుకుని పోచమ్మ, మైసమ్మ ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. కాలనీల ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు అమ్మవారికి గాలిగోపురాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. బోనాల ఊరేగింపుల్లో పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పట్టణంలోని పలు ఆలయాలకు వెళ్లి, అమవార్లను దర్శించుకున్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, తెలుగుదేశం పార్టీ నాయకులు లింగారం కుమార్‌గౌడ్‌లు హైదరాబాద్‌లోని లాల్‌దర్వాజ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

కాగా, షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవంలో పోటా పోటీగా బ్యానర్లు వెలిశాయి. మున్సిపాలిటీ ఎన్నికల్లో కౌన్సిలర్లుగా పోటీ చేయాలని భావిస్తున్న వివిధ పార్టీల నాయకులు ప్రచారం పొందడానికి పోటీపడి బ్యానర్లు ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా సాయిబాబా కాలనీలోని అమ్మవారి బోనాల ఉత్సవానికి వచ్చే భక్తులు, నాయకులు తిలకించే విధంగా సాయిబాబా ఆలయం ముఖద్వారం నుంచి అమ్మవారి ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తమ తమ బ్యానర్లను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు.

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మున్సిపల్‌తో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో బోనాలు నిర్వహించారు. సంకేపల్లి, గోపులారం, ఇంద్రారెడ్డి నగర్, మీర్జాగూడ, మహారాజ్‌పేట్ తదితర గ్రామాల్లో మహిళలు బోనాలతో ఆలయాలకు తరలివెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్, మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో ఘనంగా బోనాల వేడుకలు నిర్వహించారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 12గ్రామాలు, మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో బోనాల ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంలు


శంకర్‌పల్లి మున్సిపల్‌లోని సాయికాలనీలో బోనాలు ఊరేగింపులో స్థానికులు

ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి మొక్కుకున్నారు. పామెన గ్రామంలో సినిమా ఆర్టిస్ట్, యాంకర్ బిత్తిరి సత్తి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపులో పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మాలతీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ రాములు, మాజీ వైస్ చైర్మన్లు మాణిక్యరెడ్డి, బి.నర్సింలు, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, పాండుయాదవ్, మాజీ డైరెక్టర్ యాదగిరి, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, టీడీపీ మండ


షాబాద్ : చర్లగూడలో బోనాలతో ఆలయానికి తరలిన గ్రామస్తులు


మొయినాబాద్ : మొయినాబాద్‌లో తొట్టెల ఊరేగింపు


షాద్‌నగర్ అయ్యప్పకాలనీలో పోతరాజుల విన్యాసాలు

లాధ్యక్షుడు లొంక రాములుగౌడ్, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, ప్రభులింగం, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు వసంతం, డాక్టర్ వైభవ్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, గ్రామస్తులు, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కందుకూరు : మండలంలోని ఆకుల మైలారం గ్రామంలో బోనాల వేడుకలు జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మైసమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, మండలంలోని మిగిలిన 34 గ్రామ పంచాయతీల్లో శ్రావణమాసంలో బోనాల పండగను జరుపుకుంటారు. సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, గ్రామ మాజీ ఎంపీటీసీ అచ్చన్న పద్మ, డి.రజిత, మాజీ సర్పంచ్‌లు డి.నందీశ్వర్, జి.కళమ్మ, నాయకులు అచ్చన్న పాండు, తిరుపతయ్య, జి.రాజు, రాంరెడ్డి, సురేందర్, శేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.


శంషాబాద్ రూరల్ : బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


చేవెళ్ల : అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులు

షాబాద్ : మండలంలో ఆస్పల్లిగూడ, చర్లగూడ, సర్దార్‌నగర్, హైతాబాద్, మాచన్‌పల్లి, రుద్రారం, తదితర గ్రామాల్లో పోచమ్మ, మైసమ్మ బోనాలు జరుపుకున్నారు. ప్రజలు సల్లంగా ఉండాలని, వర్షాలు సకాలంలో కురవాలని మొక్కుకున్నారు. ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. వైభవంగా మైసమ్మ బోనాలు

చౌదరిగూడ : జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో మైసమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. తుమ్మలపల్లి, లచ్చంపేట, వనంపల్లి, కాస్లాబాద్, గుంజల్‌పహాడ్, రావిర్యాల, కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్, తంగెళ్లపల్లి, ఎంకిర్యాల, ఆగిర్యాల తదితర గ్రామాల్లో మహిళలు బోనాలతో తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, బ్యాండ్‌మేళాలు, యువకుల కేరింతలతో బోనాల ఊరేగింపు నిర్వహించారు.


కందుకూరులో యువతి

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మండలంలోని కిషన్‌గూడ, తొండుపల్లిలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేను పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్, పెదిరిపాడు ప్రవీణ్‌గౌడ్‌లు శాలువాలతో సన్మానించారు. దొడ్డి పెంటయ్య, అశోక్, కొండ దర్శన్, మహేశ్, గోవర్ధన్‌గౌడ్, గంటి రాజు, నర్సింగ్‌రావు, కొండ విష్ణు, సురేందర్, సునీల్, ముస్తఫా, నరేశ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : మొయినాబాద్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బోనాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో గ్రామపెద్దలు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


చౌదరిగూడ : తుమ్మలపల్లిలో పోతరాజుల విన్యాసాలు


చేవెళ్ల : ముడిమ్యాల్‌లో ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

క్రైం కార్నర్

కుక్కల దాడిలో నాలుగు మేకలు మృత్యువాత



కేశంపేట జూలై 20(ఆంధ్ర జ్యోతి): వీధికుక్కల దాడిలో నాలుగు మేకలు మృత్యువాత పడిన సంఘటన కేశంపేట మండలం అల్వాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కురవ మల్లేష్ తన వ్యవసాయ పొలం వద్ద శుక్రవారం రాత్రి మేకలను కొట్టంలో వదిలాడు. శనివారం తెల్లవారుజామున కొట్టంలో ఉన్న నాలుగు మేకలపై వీధి కుక్కలు దాడిచేసి చంపేశాయి. ఆదివారం ఉదయం కొట్టం వద్దకు మల్లేష్ వెళ్లి చూడగా మేకలు చనిపోయినట్లు గుర్తించాడు. కాగా, మేకల విలువ దాదాపు రూ.50వేల వరకు ఉంటుందని బాధిత రైతు మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

రోడ్డుపై గుంత.. రైతుల చింత



మాడ్గుల మండలంలోని నల్లచెర్వు గ్రామంలోని హనుమాన్ ఆలయం సమీపాన రోడ్డుపై గుంతలు పడటంతో రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యం గా రైతులు పొలాలకు ఈ దారి వెంటనే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా హనుమాన్ ఆలయానికి వెళ్లే భక్తులు కూడా ఈ దారిలోనే వెళుతుంటారు. ఇటీవల కురిసిన వర్షానికి గంతలో నీరు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ దారిలో సీసీ రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- మాడ్గుల, జూలై 20(ఆంధ్రజ్యోతి)

బాధిత కుటుంబానికి పరామర్శ

మాడ్గుల, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్కులపల్లి గ్రామానికి చెందిన ఎర్రం యాదయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డి యాదయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.3వేల ఆర్థికసాయం అందచేశారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి

260వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 260వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నేతలు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశి పల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలన


పూజలో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

కడ్తాల్, జూలై 20(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలన కొనసాగిస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన దక్షత, సాహసోపేత నిర్ణయాలతో ఏడాదిన్నర కాలంలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని ఆయన అన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే వంశీకృష్ణ సందర్శించారు. టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ నాయకులతో కలిసి మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వంశీకృష్ణకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబానికి మేలు జరుగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబాటుకు గురై అప్పుల పాలైందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి వాటిని అధిగమించి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకుపోతున్నారన్నారు. సీఎం సహకారంతో గత ప్రభుత్వంలో వెనుక బాటుకు గురైన ఉమ్మడి పాలమూరు జిల్లా వేగవంతంగా అబివృద్ధి సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రగతిని జీర్ణించుకోలేని విపక్షాలు ప్రభుత్వంపై విష ప్రచారాలకు ఒడిగట్టాయన్నారు. విపక్షాల కుట్రలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు బీచ్యనాయక్, హీరాసింగ్, లక్పతి నాయక్, జవహర్ లాల్ నాయక్, తులసీరామ్‌నాయక్, రాంచందర్ నాయక్, చేగూరి వెంకటేశ్, నరేశ్‌నాయక్, లక్ష్మయ్య, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న ప్రేమ్‌కుమార్ గౌడ్

కేశంపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్ల శాంతయ్య ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి, కొక్కుళ్ళ కుమార్, దశరథ్, మహ్మద్, తక్రుబ్, మాధవ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రూస్‌లీ వర్ధంతి

చౌదరిగూడ, జూలై 20(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్టిస్ట్ బ్రూస్‌లీ 52వ వర్ధంతిని న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆదివారం కొందుర్గు మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో బ్రూస్‌లీ చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మాస్టర్లు రమేష్, రాజు, రామకృష్ణ, కుంగ్‌ఫూ విద్యార్థులు పాల్గొన్నారు.


కొందుర్గులో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న న్యూమాంక్స్ కుంగ్‌ఫూ స్టూడెంట్స్

బీసీలు అన్నిరంగాల్లో రాణించాలి


ఆర్.కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకుంటున్న కందుకూరు మండల బీసీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు

కందుకూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీసీలు రాజకీయంగా, ఆర్థికంగానే కాకుండా అన్నిరంగాల్లో రాణించాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల జనాభా ప్రాతిపాదికన అందాల్సిన రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య అధ్యక్షతన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న అనంతరం నగరంలో ఆర్.కృష్ణయ్యను కలిసి ఆయన చేతుల మీదుగా కమిటీకి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు ఐక్యంగా ఉండి ఎన్నికల్లో విజయం సాధించాలని కోరారు. ఎగ్గిడి సత్తయ్య మాట్లాడుతూ కందుకూరు మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మండలంలోని లేమూరు గ్రామానికి చెందిన బండ ఆంజనేయులును ఎన్నుకోవడంతోపాటు ఉపాధ్యక్షులుగా ఇంద్రకంటి రవీందర్‌గౌడ్(నేదునూరు), డి.శ్రీరాములు(దెబ్బడగూడ), తోకల శ్రీనివాస్‌గౌడ్(కొత్తూరు), బి.రవి(చిప్పలపల్లి), ప్రధాన కార్యదర్శులుగా పి.జంగయ్య(బేగంపేట), బాల్‌రాజ్‌యాదవ్(నేదునూరు), అనేగౌని దామోదర్‌గౌడ్(పులిమామిడి), కోశాధికారిగా అక్కనపల్లి శ్రీనివాస్(కొత్తూరు), కార్యదర్శులుగా సౌడపు శేఖర్‌గౌడ్ (కొత్తగూడ), కాళిదాసుచారి (ఆకులమైలారం), వరికుప్పల బాబు(మాన్యగూడ), ఎ.మహేందర్(గుమ్మడవెల్లి), పి.శ్రీనివాసచారి(లేమూరు), ఎ.సురేష్‌గౌడ్(జైత్వారం), సహాయ కార్యదర్శులుగా బి.రమేష్‌గౌడ్, ఇ.నర్సింహ, ఎగ్గిడి కృష్ణ, ఎగిరిశెట్టి నరేష్, ఎస్.వెంకటేశ్, ఎం.జంగయ్య, ఎస్.రామకృష్ణయాదవ్, ఎస్.శ్రీనివాస్, జి.సురేందర్, ప్రచార కార్యదర్శులుగా పి.వెంకటేష్‌గౌడ్, పి.యాదయ్యయాదవ్, లింగంయాదవ్, బి.యాదయ్య, సీహెచ్ రవీందర్, అందె జైపాల్, బండ శ్రీను, బొమ్మరాజు మల్లేష్, కె.శంకర్, కాస నర్సింహ, కె.శివశంకర్, పిట్టల మల్లేష్, వరికుప్పల రాజు, డిల్లీ కృష్ణ, ఎగ్గిడి జగదీష్ కురుమ, సలహాదారులుగా బండ వెంకటేష్, గిలికత్తుల దేవేందర్‌గౌడ్, శేరిగూడెం అంజయ్య, పగిపళ్ల వెంకటేష్, ఎమ్మ అంజయ్య కురుమలను ఎన్నుకున్నట్లు సత్తయ్య తెలిపారు.

సంగెం- పోల్కొనిగుట్ట తండా

రోడ్డుకు మోక్షమెప్పుడో?

- కంకర తేలడంతో వాహనదారుల ఇబ్బందులు
- రోడ్డు బాగుచేయాలని ప్రజల వేడుకోలు

కేశంపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధి సంగెం-పోల్కొనిగుట్ట తండా రోడ్డు కంకరతేలడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తున్నారు. సంగెం-పోల్కొనిగుట్ట తండాల మధ్య దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇది పూర్తిగా మట్టి రోడ్డుగా ఉండేది. ఈ మార్గాన్ని పదేళ్ల క్రితం కంకర రాళ్లతో మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. అనంతరం రోడ్డును పట్టించుకోకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా దెబ్బతిని కంకర తేలింది. ఈ రోడ్డు మార్గంలో ప్రయాణం చేయాలంటేనే వాహనచోదకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనాలను నడుపుతున్నారు. ఈ రోడ్డు మార్గంలో రైతులు తరచూ పొలాలకు వెళతారు. పండించిన కూరగాయలను హైదరాబాద్‌కు తరలించడానికి నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో కనీసం జీపులు, ట్రాలీ ఆటోలు కూడా వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును బాగుచేస్తే సిద్దాపూర్, గట్టుపల్లి, మహేశ్వరంతో పాటు హైదరాబాద్ వెళ్లడానికి దగ్గరగా ఉంటుంది. రైతులు తాము పండిన కూరగాయలను షాద్‌నగర్, శంషాబాద్, గుడిమల్కాపూర్ మార్కెట్‌లకు తరలించడానికి అనుకూలంగా ఉంటుంది. అంతేకాకుండా రైతులకు దూర భారమూ తగ్గుతుంది. గిరిజన ప్రాంతాలను కలుపుతూ ఉండే రోడ్డును నాయకులు పట్టించుకోకపోవడంపట్ల ప్రజలు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును బీటీగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.


కంకర తేలిన సంగెం- పోల్కొనిగుట్ట తండా రోడ్డు

రోడ్డును బాగుచేయాలి



సంగెం-పోల్కొనిగుట్ట తండా రోడ్డును బాగు చేయాలి. రోడ్డు కంకర తేలి పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రోడ్డు దారిలోనే వ్యవసాయ పొలం ఉంది. రోడ్డు దెబ్బ తినడంతో పాలు తీసుకెళ్లడానికి ఇబ్బంది పడుతున్నా. ప్రజల ఇబ్బందులను గుర్తించి, అధికారులు రోడ్డును బాగు చేయాలి.

- కృష్ణా యాదవ్, సంగెం

ఇబ్బంది పడుతున్నాం



పోల్కొనిగుట్ట తండా రోడ్డులో నాకు వ్యవసాయ పొలం ఉంది. పండిన పంటలను ఇంటికి తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. నిత్యం బైక్‌పై వెళ్తుంటే కంకర రాళ్లు తగిలి ప్రయాణానికి ఇబ్బందిగా ఉంటోంది. అధికారులు, పాలకులు బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలి.

- కుమ్మరి శ్రీనివాస్, సంగెం